కథా నిలయం
శ్రీకాకుళం



# సీనియర్ సిటిజన్

ఆ పట్టణ శివారు ప్రాంతం చీకటి వెలుగుల రంగేళీలా కనిపిస్తోంది. ఒకవైపు ఎత్తయిన భవనాలు, అపార్టుమెంట్లు తళతళ మెరిసిపోతూ ఐశ్వర్యాన్ని ఒలకబోస్తుంటే, మరోవైపు కొన్ని ఎకరాలలో గుడిసెలు చీకట్లో మగ్గిపోతూ దరిద్రం తాండవిస్తూ వుంటుంది.

ఆ స్లమ్ ఏరియాకు అతి దగ్గర్లో వున్న కమర్షియల్ కాంప్లెక్స్ మెట్ల కింద కొత్తగా చిన్న బోర్డు వెలిసింది.

'అబ్దుల్ రజాక్, టైలర్'

రజాక్ బాగా ముసలాయన. దాదాపు డెబ్బై ఏళ్లుంటాయి. ఈ వయసులో మిషన్ తొక్కుతూ బట్టలు కుట్టి సంపాదించుకోవాల్సి రావడం బాధాకరమే అనుకున్నారు ఆ చుట్టుపక్కల షాపుల వాళ్ళు.

ఆ కాంప్లెక్స్‌లో రకరకాల షాపులున్నాయి. వాళ్లంతా రజాక్‌పట్ల సానుభూతి చూపించారు. ముసలి వయసులో ఆదుకోవాల్సిన కొడుకులు పట్టించుకోకపోతే రజాక్‌లా బాధపడాల్సిందే అనుకున్నారు.

కొంతకాలానికి 'రజాక్ భాయ్' అని స్లమ్ ఏరియా వాళ్లంతా ఆప్యాయంగా పిలుచుకోసాగారు. దేవుడులాంటోడని మెచ్చుకున్నారు. ఎందుకంటే వాళ్లకి చౌకగా బట్టలు కుట్టేవాడు. తానులు తెచ్చి ఎంతో చౌకగా షర్టులు, జాకెట్లు కుట్టి ఇచ్చేవాడు. కొంతమంది స్టిచ్చింగ్ చార్జీలు ఇవ్వకపోయినా పట్టించుకునేవాడు కాదు.

అక్కడికి దగ్గర్లోనే సీనియర్ సిటిజన్స్ ఆఫీస్ ఉంది.

ఒకరోజు సెక్రటరీ వచ్చి రజాక్‌ని పలకరించాడు.

"రజాక్ భాయ్! ఈ వయస్సులో ఇలా పొద్దస్తమానం ఎందుకు కష్టపడుతున్నావు? కొడుకులు లేరా?"

రజాక్ నవ్వి "ఎందుకు లేరూ? ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు" అన్నాడు.

"మరేంటీ? వాళ్ళు నిన్ను చూసుకోవడం లేదా?"

"ఎందుకు చూసుకోరూ? నేనే కాలక్షేపం కోసం చేస్తున్నా. చిన్నప్పటి నుంచి అలవాటైన పని. ఖాళీగా ఉండి ఏం చేస్తాం?" అన్నాడు రజాక్.

"జీవితాంతం పని చేసావుకదా... ఇంకా కష్టపడడం ఎందుకు భాయ్? మా సొసైటీలో చేరు. మేమంతా అరవై ఏళ్లు దాటినవాళ్లమే" అన్నాడు సెక్రటరీ.

"అక్కడ చేరి నేనేం చేయాలి?" అడిగాడు రజాక్.

"అక్కడ చేసేదేంలేదు. అన్ని పేపర్లు వస్తాయి. పుస్తకాలు తెప్పిస్తాం. హాయిగా చదువుకోవచ్చు. తోటివారితో మాట్లాడుతూ కాలక్షేపం చేయవచ్చు" అన్నాడు సెక్రటరీ.

"అది ఎవరికి ఉపయోగం?"

"ఉపయోగం ఏంలేదు. ఇంట్లో బోర్ కొడుతూ ఎంతసేపు ఉంటాం?"

"ఇంట్లో ఎందుకు ఉండడం? ఏదో ఒక పని చేయవచ్చుకదా?"

"మళ్ళీ మొదటికే వచ్చావు భాయ్. జీవితాంతం పని చేసాం కదా?"

రజాక్ నవ్వాడు.

"జీవితాంతం అంటే చచ్చిపోయేవరకూ! లేదా శక్తి సామర్థ్యాలు ఉడికి మంచాన పడేవరకు అని అర్థం. ఓపిక ఉన్నంతవరకు ఏదో ఒక పని చేస్తుంటేనే తృప్తి" అన్నాడు.

"వీడి ఖర్మ" అని గొణుక్కుంటూ వెళ్లిపోయాడు సెక్రటరీ.

సీనియర్ సిటిజన్స్ ఆఫీస్‌కి వెళ్లి రజాక్ గురించి అందరికీ చెప్పాడు.

"కొడుకులు బాగానే చూసుకుంటారట. ఈ ముసలాడికే చాదస్తం. చచ్చేవరకూ ఎవరికో ఉపయోగపడే పని చేయాలిట. అంతా విడ్డూరంగా మాట్లాడాడు. ఆ గుడిసెల్లో

వాళ్లకి అప్పనంగా బట్టలు కుట్టిస్తుంటాడు. వాళ్లేమో తెగ మెచ్చుకుంటారు. హాయిగా మాతోపాటు కూర్చుని కాలక్షేపం చేయవయ్యా అంటే ససేమిరా అన్నాడు."

"సరే ఎవరిష్టం వాళ్లది"

"ముసలాడికి ఓపిక ఉంది. చచ్చేవరకూ పని చేయనీ"

"అదేం కాదులే. కొడుకులు పెడుతుంటే ఇంత కష్టం ఎందుకు పడతాడు? వాళ్ళు మొండి చేయి చూపించి ఉంటారు. ఆ మాట చెప్పడానికి మొహమాట పడిపోయి ఏదేదో చెప్తున్నాడు" అన్నాడొకాయన.

"ఏమో అయి ఉండవచ్చు" అని మరొకరు అన్నారు.

★ ★ ★

ఒకరోజు స్లమ్ ఏరియా నుంచి ఏడుపులు, అరుపులు, కేకలు వినిపించసాగాయి.

రజాక్ అక్కడికి వెళ్లాడు.

ఉల్లిపాయలు అమ్మేవాడిని నలుగురు పట్టుకుని కొడుతున్నారు.

"ఏం జరిగింది?" అడిగాడు రజాక్.

"వాళ్లు నర్సింగ్ యాదవ్ మనుషులు"

"ఐతే?"

"నీకు తెలీదా భాయ్! ఈ గుడిసెలన్నీ నర్సింగ్ యాదవ్వే. ఈ ఏరియాలో అతని కిరాణా కొట్లోనే వీళ్ళు సరుకులు కొనాలి. బైటవాళ్లు ఎవరూ ఈ ఏరియాకొచ్చి అమ్మకూడదు. అమ్మితే ఇలా రుబాబు చేస్తారు".

"ఈ స్థలం నర్సింగ్ యాదవ్‌దా?"

"ఇదంతా పోరంబోకు, సర్కారుది."

"ఐతే నర్సింగ్ యాదవ్ దాదాగిరి ఏమిటి?"

"నువ్వే అన్నావుగా దాదాగిరి అని. పెట్టుబడి పెట్టి గుడిసెలు వేయించాడు. దాదాగిరి చలాయిస్తున్నాడు. వీళ్లంతా నెలనెలా అద్దె కట్టాలి. అతడు పెట్టిన కొట్లోనే అంతా ఖాతాలు తెరిచి సరుకులు కొనాలి."

రజాక్ నర్సింగ్ మనుషులకు చెప్పి పంపేసాడు. ఉల్లిపాయల బండివాడు నేలమీద పడి ఉల్లిపాయల్ని ఏరుకుని ఏడ్చుకుంటూ వెళ్లిపోయాడు.

తరువాత రజాక్ గుడిసెవాసుల్లో కొందరు పెద్దల్ని పిలిచి మాట్లాడాడు.

"మీరంతా తెల్ల రేషన్‌కార్డులు ఎందుకు తీసుకోలేదు. అది ఉంటే బియ్యం, కిరోసిన్ వంటివి చౌకగా వస్తాయికదా?" అని అడిగాడు.

"రేషన్‌కార్డులు ఇవ్వరట"

"ఏం?"

"మా ఇళ్లకి నెంబర్లు లేవుట"

"అసలు మాకు ఓట్లు కూడా లేవు భాయ్" అన్నాడొక పెద్దమనిషి.

రజాక్ నిట్టూర్చాడు.

★ ★ ★

రెండు రోజుల తరువాత ఆ ఏరియాకి గవర్నమెంటు జీప్ వచ్చింది. ఎమ్మార్వో రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ వగైరా ఉద్యోగులు వచ్చారు. గుడిసెలన్నీ తిరిగి వాటికి నెంబర్లు వేసారు. పక్కనే వున్న ప్రగతి కాలనీ స్లమ్ ఏరియా అని నామకరణం చేసుకున్నారు రికార్డుల్లో. అందరికీ ఫారాలు ఇచ్చారు. వాటిల్లో కుటుంబ సభ్యుల పేర్లు, వివరాలు ఉన్నాయి.

"మీరందరూ రేపు ఎమ్మార్వో ఆఫీసుకు రండి తెల్లరేషన్ కార్డులు ఇస్తాం. ప్రగతి కాలనీ చౌక ధరల దుకాణంలో బియ్యం, కిరోసిన్ వగైరా ఇస్తారు" అని చెప్పాడు ఎమ్మార్వో.

గుడిసెవాసులు కలా? నిజమా? అనుకున్నారు. సంవత్సరాల తరబడి రాజకీయ నాయకుల కార్యకర్తల చుట్టూ, ఎమ్మార్వో ఆఫీసు చుట్టూ తెగ తిరిగారు. కొందరు పార్టీ వర్కర్లు కార్డులు ఇప్పిస్తాం, ఇళ్ల పట్టాలు ఇప్పిస్తాం అంటూ పేదల దగ్గర డబ్బులు దండుకుపోయారు. ఇంతవరకూ ఒక్క గవర్నమెంటు ఆఫీసర్ తొంగి చూసిన పాపాన పోలేదు. అదేంటో ఈ రోజు వాళ్లంతట వాళ్లే రావడం, రేపే కార్డులు ఇస్తామని రమ్మనడం నమ్మశక్యంగాలేదు.

ఏదో అద్భుతం జరిగినట్లు ఆశ్చర్యంగా చెప్పుకున్నారు. గుడిసెల్లో వాళ్లకి ఆ రాత్రి నిద్ర పట్టలేదు. తెల్లకార్డులు వచ్చినట్లు కలలుకన్నారు కలత నిద్రలోనే.

★ ★ ★

గుడిసెల్లో వాళ్లకి తెల్లకార్డులు ఇచ్చి వాళ్లకి దానిమీద చౌకగా బియ్యం, కిరోసిన్ వంటివి ఇస్తుంటే నర్సింగ్ యాదవ్ కొట్లో ఎవరు కొంటారు? అది దివాళా తీస్తుంది. అదీగాక గుడిసెలకి నెంబర్లు ఇచ్చి ఆ తరువాత ఓట్లు వేస్తే అక్కడ పక్కా ఇళ్లు కట్టేంతవరకూ వెళ్తుంది వ్యవహారం. తన ఆదాయం మంటగలిసిపోతుందని నర్సింగ్ అంచనా వేసుకున్నాడు.

మర్నాడు పొద్దున్నే జీప్‌లో మందీమార్బలంతో వచ్చేసాడు. అప్పుడే రజాక్ షాపు తెరుస్తున్నాడు. అక్కడేదో హడావుడి జరుగుతుందని చూసి వెళ్లాడు. నర్సింగ్ యాదవ్ వీరంగం చేస్తున్నాడు.

"ఇగోజెప్తున్నా ఇనుకోండి. ఏ లుచ్ఛానాకొడుకైన తెల్లకార్డు తెస్తే అడ్డంగా నర్కుతా" గుడిసెల్లో ఉండేవాళ్లు వందమంది అక్కడే నిలబడి వణుకుతున్నారు. అందులో ముసలి వాళ్ళు, ఆడవాళ్ళు, పిల్లలేకాక యువకులు కూడా ఉన్నారు. ఎవరికీ నోరు పెగలడంలేదు. నర్సింగ్ మనుషులు ఆరుగురు అతని చుట్టూ నిల్చున్నారు.

"అన్న చెప్పిండుగా ఇనుకోండి" అని అవే మాటలు రిపీట్ చేస్తున్నారు.

"గవర్నమెంటు బీదవాళ్లకు తెల్ల రేషన్ కార్డులు ఇస్తుంటే తీసుకోవద్దంటా వేంటి బేటా?"

నర్సింగ్ యాదవ్ పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు. ఆ మాట అడిగింది రజాక్. ఎవరెట్లా పోతే మనకేంలే అనుకుని తప్పించుకునిపోయే జనం ఉన్న చోట తనది కాని సమస్యని నెత్తినేసుకుని అడిగిన వాడు ఎవడా అన్నట్లు చూసాడు నర్సింగ్.

"ఎవడ్రా ఆ బద్మాష్‌గాడు?" అరిచాడు నర్సింగ్.

"దర్జీ ఓడన్నా! కొత్తగొచ్చిండు"

"గదన్నమాట సంగతి ఓరి బుడ్డీ నోర్మూసుకో పో. నీకెందుకు?"

"పోవాల్సింది నువ్వు. ఇవాళ వీళ్లంతా రేషన్‌కార్డులు తీసుకుంటారు" స్థిరంగా అన్నాడు రజాక్.

నర్సింగ్ ముఖం ఎర్రబడిపోయింది. బూతులు తిట్టుకుంటూ రజాక్ మీదకి వచ్చాడు. రజాక్ షర్టు పట్టుకొని చెయ్యెత్తబోయాడు.

అంతే! రజాక్ గట్టిగా ఊపిరి పీల్చి రెండు చేతులతో నర్సింగ్‌ని ఎత్తి దూరంగా విసిరేసాడు. కిందపడిన నర్సింగ్ మీద కాలెత్తి తొక్కి "ఒరేయ్! మీకు సిగ్గులేదురా! తాగొచ్చి పెళ్లాల్ని తన్నడానికి పెద్ద మొగోళ్లమాదిరి పోతారు. ఈ బద్మాష్‌గాడు బూతులు తిడుతుంటే దద్దమ్మల్లా పడి వుంటార్రా? మీ నోటికాడ కూడు తన్నుకుపోతుంటే కూడా పౌరుషం రాదురా? వీళ్లందర్నీ తాళ్లతో కట్టేయండి. వీళ్ల సంగతి తేలుస్తా" పెద్దపులిలా గాండ్రించాడు రజాక్.

ఆవులా సాధువులా కనిపించే రజాక్ ఒక్కసారిగా సింహంలా గర్జించేసరికి కుర్రాళ్లకి పౌరుషం తన్నుకొచ్చింది. ఏమైతే అది అవుతుందని తెగింపు వచ్చేసింది. ఎన్నాళ్లినుంచో నర్సింగ్ ఆగడాల్ని మౌనంగా భరిస్తూ కసి పెంచుకున్న కుర్రాళ్ళు

విరుచుకుపడ్డారు. నర్సింగ్‌ని, వాడి మనుషుల్ని ఇష్టం వచ్చినట్లు తన్ని తాళ్లతో కట్టిపడేసారు. రజాక్ దగ్గర్లో ఉన్న షాపుకెళ్లి పోలీస్‌స్టేషన్‌కి ఫోన్ చేసాడు. పదినిముషాల్లో పోలీస్ వ్యాన్ సైరన్ మోగించుకుంటూ వచ్చి ఆగింది. ఇన్‌స్పెక్టర్ వ్యాన్ దిగి రజాక్‌ను చూస్తూనే సెల్యూట్ చేసాడు.

"మీరా సాబ్"? అన్నాడు

రజాక్ తలూపాడు.

నర్సింగ్‌ని, వాడి మనుషుల్ని తన్నుకుంటూ వ్యాన్ ఎక్కించారు.

నర్సింగ్ ఎర్రబడిన ముఖంతో "ఐపోయిందనుకోకు బుడ్డీ. మళ్లీ రేపొస్తా, నీ బొక్కలిరగదంతా" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ లాఠీతో రెండు ఇచ్చి 'బేవకూఫ్.... ఆయనెవరనుకున్నావుబే.... జిల్లా కలెక్టర్ ఈ సాబ్ కొడుకే" అన్నాడు.

నర్సింగ్ గుడ్లు తేలేసాడు. అది విన్న వాళ్లు బిత్తరపోయారు. నర్సింగ్ జీప్‌ని రాళ్లతో కొడుతూ అంతా ఆనందం ప్రకటిస్తూ ఉండగా పోలీస్ వ్యాన్ వెళ్లిపోయింది. గుడిసెవాసులంతా రజాక్ కాళ్లమీద పడిపోయారు. వారికి అర్థమైంది తెల్లకార్డులు అర్జెంటుగా ఎందుకు వచ్చాయో?

"రజాక్ భాయ్! కలెక్టర్ నీ కొడుకా?"

"కలెక్టర్ తండ్రివై ఉండి మామూలు దర్జీవాడిలా ఇన్నాళ్లు మాకు బట్టలు కుడుతున్నావా?"

రజాక్ ముసిముసిగా నవ్వాడు.

"నేను టైలర్ పనిచేసి బిడ్డల్ని చదివించా. నా కొడుకు కలెక్టర్ అయ్యాడు. ఐతే ఏంది? నా పని మానేయాలా? ఓపికున్నంతవరకూ పనిచేయాలి. మనం సుఖంగా ఉండాలి. అందరూ బాగుండాలని కోరుకోవాలి" అన్నాడు రజాక్.

*–ఆంధ్రభూమి మాసపత్రిక, నవంబర్, **2006***